# సంతాన సాఫల్యతపై ఐఐటీహెచ్‌లో పరిశోధనలు

- తోడ్పాటు అందించనున్న యూకే సంస్థ 'వెల్‌కం'
- ఆగస్టులో అంతర్జాతీయ సదస్సుకు ప్రణాళిక

ఈనాడు, సంగారెడ్డి: కృత్రిమ పద్ధతుల్లో సంతాన సాఫల్యత(ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్-ఐవీఎఫ్) అంశమై విస్తృత పరిశోధనలు చేపట్టేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ సిద్ధమైంది. ఈ విధానంలో సంతానం పొందేవారి విషయంలో వయసు ప్రభావం ఎలా ఉంటుందనే అంశమై ప్రధానంగా వీరు దృష్టి సారించనున్నారు. బయోమెడికల్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించే యూకేకి చెందిన సంస్థ వెల్‌కం దీనికి అవసరమైన నిధులు అందించేందుకు ముందుకొచ్చినట్లు ఐఐటీహెచ్ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనంతోపాటు.. ఆగస్టులో అంతర్జాతీయ సదస్సును నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపాయి. వీటికోసం రూ. 25 లక్షలు కేటాయించినట్టు వెల్లడించాయి.

## పరిశోధన పత్రాలు.. చర్చలు

'రీ ఫ్రేమింగ్ బయోలాజికల్ క్లాక్' పేరిట జరగనున్న ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. సంతాన సాఫల్యత పొందే అంశంలో వయసు పైబడిన వారిలో పునరుత్పత్తి అవయవాల పనితీరు ఎలా ఉంటుంది? ఈ అంశంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకోవచ్చనే కోణంతోపాటు.. వారి కుటుంబాలు ఏవిధంగా స్పందిస్తాయన్న అంశాలపై సమగ్ర చర్చలూ ఉంటాయి. ఇప్పటికే యూరప్, అమెరికా, ఆసియా దేశాల్లో జరిగిన అధ్యయనాల వివరాలను సదస్సులో నిపుణులు వెల్లడించనున్నారు. 'భారతదేశ వయోజనుల్లో కృత్రిమ సంతాన సాఫల్యత అంశంపై ప్రాథమిక అధ్యయనం' పేరిట సాగనున్న ఈ పరిశోధనలకు ఐఐటీ హైదరాబాద్ లిబరల్ ఆర్ట్స్ విభాగంలో సహాయ ఆచార్యులు అనిందిత మజుందార్ సారథ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఇటువంటి గర్భధారణతో సమాజం, పర్యావరణంపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేస్తాం. ఆ వివరాలన్నింటినీ భవిష్యత్తు పరిశోధనల కోసం ఉపయోగించుకుంటాం' అని వెల్లడించారు.